క్లుప్తంగా

ముంపు సమస్యను పరిష్కరించాలి

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయిలంక, కోటగిరిలంకలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని జైభీం భారత్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన వర్షాలకు ఇంకా మురుగునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న లంకగ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ సీతాయిలంక, కోటగిరిలంకలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల కొద్దిపాటి వర్షానికే మురుగునీరు నిలుస్తోందని చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలు రోగాల భారిన పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు పోయేందుకు శాస్వత చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ డిమాండ్ చేశారు.

3 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రులు

గణపేశ్వరం(నాగాయలంక): స్థానిక చారిత్రిక ప్రసిద్ధి కలిగిన ప్రాచీన శ్రీదుర్గా శ్రీగణపేశ్వర స్వామి, శ్రీపార్వతీ సంగమేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగినట్లు వ్యవస్థాపక ధర్మకర్త మండల రాంబాబు, ఈఓ సీహెచ్.సుధాకరరావు శనివారం చెప్పారు. అక్టోబర్ 3వ తేదీ ఉదయం గం.9.04లకు కలశ స్థాపన, శ్రీరజిత కృత శ్రీవిజయదుర్గాదేవి అలంకారంతో ఉత్సవాలు ఆరంభమై 12వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 9న సామూహిక సరస్వతీ దేవి పూజ, రోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

తహసీల్దార్‌కు సన్మానం

నాగాయలంక: ఇటీవల కృష్ణానది వరదల సమయంలో నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉత్తమ విధులు నిర్వర్తించిన మండల తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్‌ను శనివారం ఆయన కార్యాలయంలో పలువురు ప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. తొలుత జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు టి.స్వర్ణలత, జిల్లా ఎస్సీ, బీసీ నేతలు మాచవరపు ఆదినారాయణ, లకనం నాగాంజనేయులు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి, ఆయన అందించిన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఇసుక, బుసక, మట్టి అక్రమ రవాణా ఇతర అసాంఘిక కార్యకలాపాలను అణచి వేయనున్నట్లు చెప్పారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, తలశిల శివరామకృష్ణ, బలుసుపల్లి రత్నకుమార్, చీరాల తుఫాన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి వద్ద ఉన్న మద్య సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. శనివారం ఎస్‌ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో కలిసి రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కృత్తివెన్ను మండలం, మునిపెడ గ్రామానికి చెందిన ఎన్.రవీంద్రకుమార్ వద్ద ఉన్న 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

సత్తాచాటిన బాలికలు

గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–14,17 నియోజకవర్గ స్థాయి బాలికల జట్ల ఎంపికలో క్రీడాకారిణులు సత్తాచాటారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాలలో నిర్వహించిన సెలక్షన్స్‌కు గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీహెచ్.మురళీకృష్ణ, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల స్పోర్ట్స్ ఇన్‌చార్జులు అరుణ, మోహనరావు, గోవర్ధన్, పాఠశాల హెచ్‌ఎం డి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ఈనెల 30న బాలికలకు, అక్టోబరు1న బాలుర విభాగాలలో అథ్లెటిక్స్ సెలక్షన్స్ నిర్వహిస్తామని నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీహెచ్.మురళీకృష్ణ వెల్లడించారు.

బందరును అభివృద్ధి చేస్తా

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్టణాన్ని అభివృద్ధికి మారుపేరుగా మారుస్తానని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన రైలుపేట ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. మంత్రి వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్‌పాషా, టీడీపీ నగర నాయకుడు పిప్పళ్ల కాంతారావు, టీడీపీ నాయకులు బొమ్మిడి శ్రీరాములు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

ఘంటసాల: మండల డెప్యూటీ తహసీల్దార్‌గా బి.కనకదుర్గ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా తన పరిధిలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇతర సమస్యలను తహసీల్దార్, ఉన్నతాధికారుల సహకారంతో సకాలంలో పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గుడ్లవల్లేరు మండలంలో పని చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు ఆమె తెలిపారు.

బాబుకు మంచి బుద్ధి ఇవ్వు స్వామీ!

- బాబు పాపపు బుద్ధి ప్రక్షాళన చేయాలని పూజలు
- దమ్ముంటే.. ధైర్యం ఉంటే సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్
- సీబీఐ విచారణతో ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా ఉంటాయి
- మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్ అదే
- ఆలయాల్లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, నాయకుల పూజలు



పెడనలో పూజలు చేస్తున్న ఉప్పాల రాము, నాయకులు, కార్యకర్తలు



మోపిదేవిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

పెడన: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేసి అప్రతిష్టపాలు చేసిన చంద్రబాబు పాపపు బుద్ధిని ప్రక్షాళన చేయాలని కోరుతూ ఆలయాల్లో పార్టీ శ్రేణులు అభిషేకాలు, పూజలు చేశారు. కలియుగ దైవం.. ప్రపంచమంతా ఆరాధించే దేవుడు తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని చెబుతున్న చంద్రబాబునాయుడు సీబీఐ విచారణ చేయించి హిందువుల మనోభావాలను కాపాడాలని, ఇదే విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. శనివారం పట్టణంలోని శ్యామలానగర్‌లో వేంచేసి ఉన్న శ్రీపద్మావతీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూప్రసాదంపై తప్పుడు ఆరోపణలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండ్ కో పార్టీకి మంచి బుద్ధి ప్రసాదించి లడ్డూ ప్రసాదం పవిత్రతను అపవిత్రం చేసిన వారి పాపాన్ని ప్రక్షాళన చేయాలని భగవంతుని ప్రార్థిస్తూ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాము మాట్లాడుతూ లడ్డూ పాపం చంద్రబాబుదేనని, కులాలను, మతాలను విడగొట్టాలని చూస్తున్నారని, అవన్నీ అసాధ్యమన్నారు. చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే, హిందూవులపై అభిమానం ఉంటే, తక్షణం సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారు ఇలాంటి నీచ రాజకీయాలు చేసే వారికి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా కోరుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు వైధాని వెంకట్రాజు, సుజ్ఞానం మహేష్, పర్ణం పెదబాబు, బండారు మల్లికార్జునరావు, జెడ్పీటీసీలు రత్నకుమారి, వెంకటరమణ, ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల: శ్రీ వెంకటేశ్వర స్వామి సాక్షిగా అబద్ధాలు చెప్తూ రాజకీయాలు చేస్తున్న కూటమి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం స్థానిక శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో విఫలమై ఏకంగా దేవుడినే అడ్డం పెట్టుకుని టీటీడీ లడ్డూ ప్రసాదాన్ని రాజకీయంగా వాడుకోవడం బాధాకరమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జలధీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించామన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడువేమూరివెంకట్రావుఆధ్వర్యంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వేమూరి ప్రవీణ్, దిరిశం పిచ్చేశ్వరరావు, వేమూరి రత్న శేఖర్, వేమూరి హర్షవర్ధన్, ఆకురాతి భాస్కరరావు, కొణతం శ్రీను, కోటేశ్వరరావు, పెనుమత్స శేఖర్, బాబూరావు, కిషోర్, సాంబశివరావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా.. బాబుకు సద్బుద్ధినివ్వు

నాగాయలంక: తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం వైఎస్సార్ సీపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజ జరిపించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), మండల నాయకులు, ఆలయ అర్చకుడు మహంకాళి ప్రకాష్‌శర్మతో ప్రత్యేక పూజ చేయించారు. అనంతరం ఆలయం వెలుపల చిన్నారి మాట్లాడుతూ చివరి దశలో బాబుకు మంచి బుద్ధి ఇచ్చేలా అత్యంత శక్తిమంతుడైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, తిరుమల వెంకటేశ్వర స్వామిని వేడుకున్నామని చెప్పారు. పార్టీ మండల నాయకులు రేపల్లె రామ్మోహనరావు, బర్మా రాంబాబు, తానంకి వేణుబాబు, చిట్టా బాలపాపారావు, బీమా బాబూరావు, భోగాది రాధాకృష్ణ, మద్ది కొండలు, రేమాల నాగరాజు తదితర నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

కోడూరు: రాజకీయ దుర్బుద్ధితో తిరుమల పవిత్రతను, స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగినట్లుగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అసత్య ప్రచారం చేయడంపై మండల వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నేతలు, కార్యకర్తలు శనివారం కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఆ వెంకటేశ్వరుడు సద్బుద్ధి ప్రసాదించాలంటూ పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, పరిశె మాధవరావు, ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు, నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో..

మోపిదేవి: మండలంలో మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవనిగడ్డ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా మోపిదేవి ఆలయానికి చేరుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణచేసి భక్తిశ్రద్ధలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మోపిదేవి దేవస్థానంలోనూ గత ఐదు సంవత్సరాల నుంచి అవినీతి జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే సీబీసీఐడీ ఎంక్వయిరీ చేయాలని కోరుతుండగా, టీటీడీలో జరిగిన సంఘటనలపై మాత్రం ఐజీ స్థాయి అధికారిని నియమించడాన్ని తప్పుపట్టారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద

రాజకీయ దుర్బుద్ధితోనే..

అవనిగడ్డ: తిరుపతి లడ్డూ ప్రసాదంపై విష ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి పాప ప్రక్షాళన చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ దుర్బుద్ధితోనే చంద్రబాబు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విషప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు మాట్లాడటం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. రాజకీయాల కోసం తిరుపతి వెంకటేశ్వరస్వామిని చంద్రబాబు వాడుకోవడం చాలా హీనమైన చర్య అన్నారు. ఈ విషయమై సీబీఐ దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టుకి, ప్రధాన మంత్రి నరేంద్రమోడికి జగన్ లేఖలు రాశారని అన్నారు. ఈ పనిచేస్తే ఎక్కడ తన బండారం బయట పడుతుందోనని ఈకేసుని చంద్రబాబు సిట్‌కు అప్పగించి తన వీరవిధేయులుగా ఉన్న వ్యక్తిని అధికారిగా నియమించుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఈ కేసుని సీబీఐకి అప్పగించి నిజానిజాలు వెలికితీసేలా చేసి తిరుపతి లడ్డూ ప్రాచుర్యానికి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి కెప్టెన్ లక్ష్మి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, యూత్ నాయకులు చింతలపూడి లక్ష్మీనారాయణ, చిట్టూరి రమేష్, దామోదర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



నాగాయలంక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో..



కోడూరులో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఘంటసాల జలధీశ్వర స్వామి ఆలయంలో..

హామీలు అమలు చేయలేక లడ్డూ రాజకీయం



పూజల అనంతరం మాట్లాడుతున్న పేర్ని కిట్టు, చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ, తదితరులు

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా మేనిఫెస్టోలోని హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని దీనిని కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక బచ్చుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి పేర్ని కిట్టు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ గోవింద నామాలు స్మరించారు. పార్టీ కార్యాలయం నుంచి ఆలయం వరకు ర్యాలీగా గోవింద నామస్మరణతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రానికి ఉన్న ప్రాశస్త్యాన్ని సైతం తన రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ప్రపంచ వ్యాప్తంగా మంటగలిపేందుకు పూనుకున్నాడని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి పాత్రుడైన వేంకటేశ్వరస్వామి లడ్డూ కల్తీ అంటూ వాస్తవదూర ఆరోపణలు చేసి చివరకు అది అవాస్తవమని ప్రజలు గమనించటంతో మాజీ సీఎం జగన్ తిరుమల వెళితే డిక్లరేషన్ ఇవ్వాలనే కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇంత అన్యాయంగా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సబబేనా, నీ నీచ రాజకీయం కోసం కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తావా అని కిట్టు చంద్రబాబు ను ప్రశ్నించారు. లడ్డూ తయారీలో యానిమల్ ఫ్యాట్ కలిసిందో లేదో విచారించేందుకు సిట్ కాకుండా సీబీఐతో దర్యాప్తు చేయించాలని కిట్టు డిమాండ్ చేశారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకృతుల ప్రదర్శన

బంటుమిల్లి: మండల స్థాయిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పలు రకాల బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రదర్శనలో ఉన్నత, అప్పర్ ప్రైమరీ పాఠశాలల నుంచి విద్యార్థులు పలు వస్తువులు తయారుచేసి ప్రదర్శించారు. పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ.అరుణకుమారి ప్రథమ బహుమతి, బంటుమిల్లి కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి ఎస్ఎస్ఎన్ శేఖర్ ద్వితీయ బహుమతి, సెంయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి ఎం.సురేష్ తృతీయ బహుమతి సాధించారు. మండల స్థాయిలో బహుమతులు అందుకున్న విజేతలు అక్టోబరు 2న జిల్లా స్థాయిలో జరిగే ప్రదర్శనలో పాల్గొంటారని ఎంఈఓ త్రిపురసుందరీదేవీ తెలిపారు.

నాగాయలంక: మండలంలో పాఠశాలల విద్యార్థులు చేపట్టిన వ్యర్థాల నుంచి కళాకృతులు (వేస్ట్ టు ఆర్ట్) కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్ నాగాయలంక హైస్కూలులో శనివారం జరిగింది. మండలంలో 15 పాఠశాలల నుంచి 300 మంది బాల బాలికలు వ్యర్థాల నుంచి కళాకృతులు తయారు చేసి ప్రదర్శించారు. తొలుత మండల విద్యాశాఖ అధికారి టీవీఎస్ రామదాసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాగాయలంక, భావదేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, నాలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లు మొదటి మూడు స్థానాలలో నిలిచాయి. విజేతలు అక్టోబర్ 2న బందరులో జిల్లా స్థాయిలో జరిగే ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని ఎంఈఓ చెప్పారు.

భళా.. విద్యార్థుల నైపుణ్య కళ

కోడూరు: వ్యర్థాలతో కూడా గృహాల్లో ఉపయోగించే వస్తువులు తయారు చేయవచ్చని విద్యార్థుల తమ నైపుణ్య కళతో చాటిచెప్పారు.'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయిలో వ్యర్థాలతో వస్తువుల తయారీ (వేస్ట్ ఆఫ్ ఆర్ట్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఎంఈఓలు టి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి మార్కులు వేశారు. లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన టీకేటిల్, కప్పులకు ప్రథమ స్థానం, అయోధ్య రామాలయం తయారు చేసిన వి.కొత్తపాలెం జెడ్పీ, కొండపల్లి బొమ్మ తయారు చేసిన జీవీ అకాడమీ విద్యార్థులకు ద్వితీయస్థానం, సెలైన్ బాటిల్, ఫ్లవర్ పాట్ తయారు చేసిన కోడూరు జెడ్పీ, స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పిస్తా పప్పు తొక్కలతో ఫొటో ఫ్రేమ్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. ఎద్దుల బండి తయారు చేసిన పోటుమీద ఎంపీయూపీ, టార్చ్‌లైట్ తయారు చేసిన లింగారెడ్డిపాలెం పాఠశాల విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోడూరులో బహుమతులు సాధించిన వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం(ఘంటసాల): మండల స్థాయిలో వేస్ట్ టు ఆర్ట్ పోటీల్లో శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్ఎం. అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి శనివారం తెలిపారు. హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న పెనుమచ్చ ప్రజ్వల్, తోడేటి అద్వైత్, చిట్టూరి సంతోష్ వివిధ వ్యర్థాలను ఉపయోగించి కళాకృతులను తయారు చేయగా న్యాయ నిర్ణేతలు వారికి ప్రథమ స్థానం ప్రకటించారని చెప్పారు. అనంతరం ఎంఈఓ–2 ఎండీ మోమిన్ బహుమతులు అందజేశారని హెచ్ఎం తెలిపారు.

మోపిదేవి: మండలంలో మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులు పలు వ్యర్థాల నుంచి తయారు చేసిన వస్తువులతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వాటిని ఎంఈవో దుర్గా సాగర్ పరిశీలించారు. ఎంపికైన కళాకృతులను అక్టోబర్ 2న మచిలీపట్నంలో నిర్వహించే ఎగ్జిబిషన్ లో ప్రదర్శిస్తారని చెప్పారు. అక్కడ సెలెక్ట్ అయిన కళాకృతులకు బహుమతులు ఇస్తారని ఎంఈవో వివరించారు.

సంక్షిప్త వార్తలు

■ గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

గూడూరు: పీఎంఏవై ఫేజ్–1లో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.రాజేశ్వరి కోరారు. మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం గూడూరులోని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తేజేష్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

■ విద్యార్థులకు పోటీలు

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర–2047 కోసం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంఈఓలు బి.త్రిపురసుందరీదేవి, ఏ.వెంకటేశ్వరరావు పలు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్లు కె.కిషోర్, సాబూజానీలు అభినందించారు.

పెడన: స్వర్ణంధ్రా విజన్–2047 మండల స్థాయి పోటీలను శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వ్యాసరచన, వృక్తృత్వ పోటీలకు హాజరయ్యారు. ఆయా పోటీలను ఎంఈవో–2 వైవీ హరనాథ్ పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా ఆర్.సత్యనారాయణ, పి.షణ్ముఖరావు ఉపాధ్యాయులుగా ఉన్నారు. విజేతలు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కానున్నారని తెలిపారు.

■ కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన బాదర్ల వెంకటరమణ కుమ్మరిపాలెం ఎంపీయూపీ పాఠశాలకు శనివారం కంప్యూటర్, సీపీయూ యూనిట్‌తో పాటు ప్రింటర్‌ను ఉపాధ్యాయ బృందానికి అందించాడు. పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో వారిని అభినందించారు. అడిగి వెంటనే సహాయం అందించిన వెంకటరమణను ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు భవానీ, వి.ఉమామహేశ్వరరావు, నాగమణి, రవికుమార్, శర్మ పాల్గొన్నారు.

■ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మైఖేల్ మృతి

మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నగర సీనియర్ నాయకుడు దాసరి కమల ప్రసాద్ (మైఖేల్ 49) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. మైఖేల్ మృతదేహాన్ని శారద నగర్ లోని ఆయన స్వగృహానికి తరలించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ ఎండ్రపాటి నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ కోకిలగడ్డ శరత్ కుమార్, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బందెల థామస్‌నోబుల్, వై.చైతన్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మైఖేల్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

■ సీడ్ బాల్స్ తయారీ

మచిలీపట్నంటౌన్: వాసవీ, వనిత, కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీ (తడి మట్టిలో విత్తనాలు ఉంచి ఉండలుగా తయారు చేయడం) విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆ క్లబ్‌ల ప్రతినిధులు శనివారం తెలిపారు. స్థానిక ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ భాస్కర్, ప్రిన్సిపాల్ జేవీఆర్‌ల సహకారంతో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఈ సీడ్ బాల్స్‌ను తయారు చేశారని తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ యెండూరి సురేష్, డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ తూనుగుంట్ల రంగనాయకులు, రీజనల్ చైర్‌పర్సన్ శ్రీకాకుళపు రేణుకారాణి, రీజనల్ సెక్రటరీ వేముల శిరీష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సీడ్ బాల్స్‌ను శనివారం ప్రదర్శించారు.

■ నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రయాణికులు వారి సమస్యలను, సలహాలను తెలపాలని కోరారు. 99592 25462 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని ఆయన సూచించారు.

■ జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపిక

మోపిదేవి: స్థానిక గురుకుల పాఠశాలలలో ఇటీవల మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా అండర్–14, 17 విభాగాల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి శనివారం ప్రకటించారు. అండర్–14 విభాగంలో కె.రాముడు, కె.లక్ష్మణుడు, టీ సాయి వర్మ, బి.మణికంఠస్వామి, బి. పార్థు ఎంపిక కాగా, అండర్–17 విభాగంలో పి.రామ్ చరణ్, సీహెచ్ లోకేష్, టీ ప్రశాంత్, పి.ధర్మ తేజ లను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వివరించారు.

సమాజంలో మార్పుకోసం పరితపించిన జాషువా



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: సమాజంలో మార్పు కోసం మహాకవి గుర్రం జాషువా పరితపించారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గాంధీ క్షేత్రంలో గుర్రం జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాషువా తన రచనలు ద్వారా సమాజంలో ఉన్న కులవివక్షత, అంతరాలను తొలగిపోయేలా ప్రజలను మేల్కొలిపారని చెప్పారు. అందుకే ఆయనకు పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కళాప్రపూర్ణ అవార్డులు వరించాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, న్యాయవాది కర్రా సుధాకర్, కూటమి నాయకులు పరుచూరి సుభాష్‌చంద్రబోస్, కోఖిల ఏడుకొండలు, కొల్లూరి ఇమ్మానియేల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదలపై తగ్గని అక్కసు



శిథిలాలను చదును చేస్తున్న జేసీబీలు

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వ పెద్దలకు కుమ్మరిగూడెం పేదలపై ఇంకా అక్కసు తీరలేదు. 41వ డివిజన్ కుమ్మరిగూడెంలో ప్రభుత్వ స్థలంలో పేదలు నిర్మించుకున్న గృహాలను మంగళవారం నిర్దాక్షిణ్యంగా పోలీస్ పహారా నడుమ కూల్చేశారు. గృహాల శిథిలాల్లో ఉన్న రాళ్లు, చెక్కలు, మట్టి తదితర వస్తువులను పేదలు వెలికితీసి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. కూల్చిన రోజు నుంచి వర్షాలు కురవటంతో శిథిలాలను భద్రపరుచుకోలేకపోయారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నాలుగు జేసీబీలతో శిథిలాలను చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ ప్రాంత పేదలపై ప్రభుత్వ పెద్దలకు ఉన్న అక్కసును మరోసారి ప్రదర్శించారు. దీంతో అక్కడున్న శిథిల వస్తువులను, మట్టిని ట్రాక్టర్లపై తీసుకువెళదామని భావించిన పేదలకు అవి కూడా దక్కకుండా చేస్తుండటంతో వారి వేదనకు అంతు లేకుండా పోయింది. ఈ శిథిలాల చదును పనులను కమిషనర్ బాపిరాజు పర్యవేక్షించారు.

రేషన్ దుకాణాల తనిఖీ



కాకర్లమూడి రేషన్‌దుకాణంలో తనిఖీ చేస్తున్న పీడీఎస్ డీటీ సుభాని, ఆర్‌ఐ మణికుమార్ తదితరులు

పెడన: మండల పరిధిలోని కాకర్లమూడి, బల్లిపర్రు గ్రామాలకు చెందిన రేషన్ డీలర్ దుకాణాలను ఇటీవల కొత్తగా వచ్చిన పీడీఎస్ డీటీ సుభాని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కాకర్లమూడి షాపు వద్దకు వెళ్లగా తాళం వేసి ఉండటంతో తాళాం తీసుకువచ్చే వరకు వేచి ఉన్నారు. అనంతరం తాళం తెచ్చి తీయడంతో మండల ఆర్‌ఐ మణికుమార్‌తో కలిసి రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. అక్టోబరు నెలకు సంబంధించిన స్టాక్ వచ్చి ఉండటంతో ఎన్ని బస్తాలున్నాయి, పాత సరుకు ఎంత ఉందనే వివరాలను అడిగి తెలుసుకుని క్రాస్ చెక్ చేశారు. రేషన్ డీలర్ పద్మ భర్త వీరబాబుపై పలు ఫిర్యాదులు వస్తుండటంతో సక్రమంగా పంపిణీ చేయకపోతే డీలర్ షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. బల్లిపర్రు గ్రామానికి కూడా కాకర్లమూడి డీలరే ఇన్‌చార్జిగా ఉండటంతో అక్కడ కూడా స్టాక్ వివరాలను పరిశీలించారు. వీరితో వీఆర్‌ఏ ఈశ్వరీ తదితరులున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్కమ్ పార్టీ ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. సభలో కళాశాల కరెస్పాండంట్ కే కుమార్‌బాబు, చైర్మన్ జీఎం ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కళాశాల సెక్రటరీ తాడేపల్లి మెహెర్ బాబా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ డి.బాబా, టి.సాయి కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, కోఆర్డినేటర్ ఎస్.అనిల్ కుమార్, విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.